క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



పాల్గొన్న కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్

రాజేంద్రనగర్: ప్రజలంతా తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ న్యూఫ్రెండ్స్ కాలనీలోని మైసమ్మ దేవాలయంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ విభాగం' ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహించారు. డాక్టర్లు, నర్సులు, కాలనీవాసులు శ్రీపాల్‌రెడ్డి, సిద్దేశ్వర్, మల్లేష్‌చారి, మధుసూధన్‌రెడ్డి, వేంకటేష్ తదితరులున్నారు.

మిల్లెట్ టిఫిన్ సెంటర్ ప్రారంభం

మణికొండ: ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజలు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు తృణధాన్యాలు వాడాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్‌లో మంగళవారం వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మిల్లెట్స్ ఆర్గానిక్ టిఫిన్' కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన పెద్దలు నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవడంతోనే వారు ఆరోగ్యంగా జీవించారన్నారు. ప్రస్తుతం మనం కూడా వారి బాటలోనే ప్రయాణించి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ మేయర్

బండ్లగూడ: రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ నెల 18న కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, మేయర్లు, చైర్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా టెబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు మహవీర్ విద్యాసంస్థల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఈ నెల 4 నుంచి 8వరకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే దాదాపు 500 మంది క్రీడాకారులకు కళాశాలలో ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈరోజు ఉదయం 9 గంటలకు ఈ టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. చైర్మన్ టోర్నమెంట్ ప్రకాష్‌రాజు, కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, చైర్మన్ ఎస్.జయలక్ష్మి, ప్రిన్సిపాల్ బీ.వీ.శంకర్‌రావు, డాక్టర్ సతీష్‌బాబు, సీతారామారావు తదితరులున్నారు.

భూపాల్‌నగర్‌లో ఫాగింగ్ !

రాజేంద్రనగర్: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ సూచించారు. చెత్తచెదారాలతో పాటు మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. భూపాల్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి స్థానికులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమలు వృద్ధి చెందుతాయని నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాల్లో చెత్తచెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫాగింగ్ ద్వారా దోమల నివారణ కొంత మేర తగ్గుతుందన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోల్కొండ: అధికారులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీలోని తన కార్యాలయంలో పలువురు బల్దియా అధికారులు రామ్‌కీ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన శానిటేషన్ పనులపై వారితో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పనులు మరింత ప్రణాళికాబద్ధంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. చెత్త ఊడ్చే పనులు సక్రమంగా జరుగుతున్నా.. చెత్త కుప్పలను తరలించడం లేదని, తనకు తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. శానిటైజేషన్ సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు తమ పరిధిలో పర్యటిస్తూ ఉండాలని అన్నారు. అంతేగాకుండా బస్తీలు, కాలనీల నుంచి వస్తున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అధికారులను కోరారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

మైలార్‌దేవ్‌పల్లి: బహుజన స్త్రీల విద్యావ్యాప్తికి కృషి చేసిన మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. ఆమె జయంతి సందర్భంగా రాజేంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రతి ఒక్కరూ వారి ఆశయాలు, లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, ఇమ్మాన్యుయేల్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..

- సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు మల్లేష్, కేవీపీఎస్ నాయకుడు ఎర్రవెంకటేష్ తదితరులున్నారు.

రాజేంద్రనగర్ జూనియర్ కళాశాలలో..

రాజేంద్రనగర్: సంఘ సంస్కర్త, ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలను రాజేంద్రనగర్‌లో ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావుపూలే ఉత్సవ కమిటీ అధ్యక్షులు కె.రఘుగౌడ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల ప్రాంతంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, కృష్ణమాచారి, ప్రిన్సిపాల్ అంజయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై నివాళులర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అడికే అర్జున్, శ్రీను, సత్యనారాయణముదిరాజ్, సత్తయ్య, కె.యాదయ్యముదిరాజ్, కె.రఘుముదిరాజ్, సిద్దేశ్వర్, అంజయ్యగౌడ్, సాయిగౌడ్, భిక్షపతి, శ్రీనివాస్‌గౌడ్, స్వర్ణగౌడ్, యాదమ్మయాదవ్, శివముదిరాజ్, మల్లికార్జున్‌గౌడ్, కొండల్‌ముదిరాజ్, వేముల రామకృష్ణ, సుధాకర్‌గౌడ్, గణేష్, దయాకర్‌గౌడ్ తదితరులున్నారు.



రాజేంద్రనగర్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నేటి తరం మహిళలకు ఆదర్శం..

మణికొండ: స్త్రీలకు విద్య అవసరం అని గుర్తించి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మారి సావిత్రి బాయి పూలే నేటి మహిళలకు ఆదర్శంగా నిలిచారని మాంగల్యం ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కీర్తిలతగౌడ్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డిలు అన్నారు. మంగళవారం ఆమె జయంతి సందర్భంగా మణికొండ, వీకర్‌సెక్షన్, పుప్పాల్‌గూడ, నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. సమాజానికి కొత్త మార్గాన్ని చూపి ఆమె మహిళల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆమె జన్మదినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని వారు డిమాండ్ చేశారు. కౌన్సిలర్‌లు వసంతరావు, అనిల్‌కుమార్, కావ్యశ్రీరాములు, మీనముత్యాలు, ఎల్. వందనానగేష్, శ్వేతారవికాంత్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యురాలు లక్ష్మీరాములు, బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, సినీ గాయకుడు, రచయిత మానుకోట ప్రసాద్, లావణ్య, ప్రధానోపాధ్యాయులు నిరంజన్, మాంగ్యానాయక్, నాయకులు జయరాజ్, బషీర్, సీతారాందాస్, డాక్టర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్‌లో కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ తదితరులు



నివాళి అర్పిస్తున్న నాయకులు



మణికొండలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



శంషాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో..

కేలండర్ ఆవిష్కరణ



శంషాబాద్: శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 2023 నూతన కేలండర్‌ను చైర్మన్ మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ.. అన్నదాతలు సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ రాయితీలు పొందాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైస్‌చైర్మన్ జ్ఞానేశ్వర్, డైరెక్టర్లు రంగారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అరుంధతి, సత్తిరెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్, సురేందర్, పోచయ్య, శ్రీనివాస్, సంఘం సీఈఓ అర్జున్, ఉద్యోగులు మోహన్, వెంకటేష్, రాజు, రాంరెడ్డి తదితరులున్నారు.



వర్సిటీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. మండల తహసీల్దార్ చంద్రశేఖర్, రాజేంద్రనగర్ ఏసీపీల చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులంతా కలిసికట్టుగా ఉంటూ తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మణికొండ: మహిళలు డ్వాక్రా సంఘాల్లో చేరి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాలు, ఉత్పత్తుల తయారీ చేపట్టి ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానికంగా పేపర్ ప్లేట్‌ల తయారీ, ఫుడ్ కేటరింగ్, జూట్ బ్యాగ్‌ల తయారీ లాంటివి చేపడితే స్థానికంగానే వాటిని కొనుగోలు చేసే వారు అధికంగా ఉన్నారన్నారు. అలాంటి శిక్షణలకు మహిళలకు స్థానికంగానే అందించేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలు వేరు చేసేలా ప్రజలను ప్రోత్సహించేందుకు డ్వాక్రా మహిళలు తమ వంతు కృషి చేయాలన్నారు. కౌన్సిలర్‌లు శ్వేతారవికాంత్‌రెడ్డి, మీన ముత్యాలు, ఎల్. వందన నగేష్, కో–ఆప్షన్ సభ్యురాలు లక్ష్మీ, డ్వాక్రా సంఘాల ఆర్‌పీ రాజేశ్వరి, టీఎంసీ లక్ష్మీలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రాజేంద్రనగర్: ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేస్తూ బీజేపీని ముందుకు తీసుకెళ్లాలని డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, కో– కన్వీనర్ మహాలింగంగౌడ్‌ల అధ్యక్షతన అసెంబ్లీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్, అంజన్‌కుమార్‌గౌడ్, వై.శ్రీధర్, ఎన్.మల్లారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఈనెల 7న సామ భూపాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం బూత్ కమిటీలను పూర్తిచేయాలని సూచించారు. బండి సంజయ్ అధ్యక్షతన ప్రజా సంగ్రామ యాత్రతో ప్రజా సమస్యలను గ్రామాలకు వెళ్లి తెలుసుకుంటూ ఉండడంతో బీజేపీకి రాష్ట్రమంతటా సానుకూల పవనాలు వీస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ టికెట్‌ను ఎవరికి ఇచ్చిన అందరూ కష్టపడి పని చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్, మోండ్ర కొమురయ్య, నరేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాచూరి రాజశేఖర్, తోకల సుధాకర్‌రెడ్డి, రాజు, మూల శ్రీనివాస్‌గౌడ్, జోగి రవి, బొక్క బాల్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, విజయ్‌కుమార్, జనార్దన్, నిఖిల్ తదితరులున్నారు.

నేడు 'ఐఎస్‌బీ'లో పబ్లిక్ పాలసీ డైలాగ్స్–2023

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (బిఐపీపీ) ఆధ్వర్యంలో 'పబ్లిక్ పాలసీ డైలాగ్స్–2023' మొదటి ఎడిషన్‌ను బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహించేందుకు ఐఎస్‌బీ ఏర్పాట్లు చేసింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభ కార్యక్రమం ఖేమ్కా ఆడిటోరియంలో లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కటికతల శ్రీనివాస్, ప్రధాని మాజీ సలహాదారు అమర్‌జీత్‌సిన్హా, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రెటరీ జుగల్ కిషోర్ మోహపాత్ర, టైమ్స్ నెట్‌వర్క్ గ్రూప్ ఎడిటర్ నవికాకుమార్, ఐఎస్‌బీలోని బిఐపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశ్వినిచాత్రే తదితరులు పాల్గొంటారు.

గుండెపోటుతో వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

శంషాబాద్: అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో వాహనం అదుపు ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. శివరాంపల్లిలో నివసించే సంజయ్ మీమ్‌కార్ (45) ద్విచక్ర వాహనంపై శంషాబాద్ వైపు వస్తుండగా వాహనం అదుపు తప్పి ముందున్న వాహనాన్ని ఢీ కొట్టి కిందపడిపోయాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సీఆర్‌పీ చేసినప్పటికీ కోలుకోలేదు. పరిశీలించిన 108 సిబ్బంది అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతోనే వాహనం అదుపు తప్పి కిందపడిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. అన్సారీ రోడ్డు ఓవైసి హిల్స్ ప్రాంతంలో నివసిస్తున్న ఫిరోజ్‌ఖాన్ (27) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. 18 నెలల క్రితం స్థానిక యువతితో వివాహం కాగా వీరికి ఓ కుమారుడు సంతానం. పెళ్లికి చేసిన అప్పులు తీర్చకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మణికొండ: ద్విచక్ర వాహనంపై తన భార్యను దింపి తిరిగి ఇంటికి వస్తున్న ఓ వ్యక్తిని రెడీమిక్స్ వాహనం వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి కోకాపేట్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మోకిలకు చెందిన ముకేష్‌కుమార్(30) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. మంగళవారం ఉదయం తన బార్యను చంపాపేట్‌లో దింపి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కోకాపేట చౌరస్తా వద్దకు రాగానే వెనక నుంచి వస్తున్న రెడీమిక్స్ వాహనం ఢీకొట్టగా.. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు రాతారాం చౌదరి ఆసుపత్రికి చేరుకోగా అతడు అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కొండా కుమారుడి వివాహ రిసెప్షన్

మణికొండ: చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అపోలో ఆసుపత్రి డైరెక్టర్ సంగీతల కుమారుడి వివాహ రిసెప్షన్ నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. మంగళవారం నూతన దంపతులను కేంద్రమంత్రి మీనాక్షి లేఖి, గోవా గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్, మాజీ కేంద్ర మంత్రి గులాబ్‌నబీ ఆజాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, బిక్షపతియాదవ్, గద్దర్, అపోలో ఆసుపత్రి చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలు ఆశీర్వదించారు.



శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

ప్రారంభమైన మార్కెట్ పనులు



మణికొండ: నార్సింగిలో కూరగాయలు, మాంసాహార మార్కెట్ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మంగళవారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏకంగా రూ. 4 కోట్లతో అధునాతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి గతంలోనే ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. స్థానిక వ్యాపారులు దశాబ్దాలుగా సదరు స్థలంలో తమ షెడ్‌లు ఉన్నాయని వాటిని తొలగిస్తే మా జీవనాధారాన్ని కోల్పోతామని పశువుల వ్యాపారస్తులు అడ్డుకున్నారు. వారిని మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ సముదాయించి పనులను ప్రారంభించారు. అన్ని రకాల కూరగాయాలు, మాంసాహారాలు ఒకే చోట లభిస్తాయని వివరించారు. కో– ఆప్షన్ సభ్యుడు మహ్మద్, స్థానికులు పాల్గొన్నారు.

కారు బీభత్సం.. కేసు నమోదు

శంషాబాద్: అర్ధరాత్రి ఓ వైద్య విద్యార్థి కారుతో బీభత్సం సృష్టించాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఢీ కొట్టడంతో పాటు వారితో దురుసుగా ప్రవర్తించాడు. ఈ ఘటనలో ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధి ఎయిర్‌పోర్టు రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి 1.20 గంటల సమయంలో ఎయిర్‌పోర్టు రెండో రోటరీ వద్ద బంజారాహిల్స్‌కు చెందిన వైద్య విద్యార్థి గౌతమ్ మోహతి(25) అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ముందుగా వెళ్తున్న ఆటోను వెనక నుంచి ఢీ కొట్టాడు. దీంతో ఆటో డ్రైవింగ్ తాజుద్దీన్ తలకు తీవ్ర గాయమైంది. కాగా మరికొద్ది సేపటికే ఎయిర్‌పోర్టు వైపు వెళ్తున్న మరో కారును ఢీ కొట్టగా.. కారు వెనక భాగంతో పాటు ఎడమవైపు కూడా ధ్వంసమైంది. వీరితో పాటు ఓ ద్విచక్రవాహనదారుడిని ఢీ కొట్టాడు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా.. మద్యం తాగినట్లు తేలలేదు. దీంతో అతడు మరేదైనా మత్తుపదార్థాలు సేవించాడా.. అనే అనుమానంతో పోలీసులు రక్తనమూనాలను తీసుకుని పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ వెంచర్‌లో పనులు నిలిపివేత



కేబీ.దొడ్డి సమీపంలో వెంచర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి



ఇరిగేషన్ ఏఈకి ఫిర్యాదు చేస్తున్న కేబీ.దొడ్డి ప్రజలు

శంషాబాద్ రూరల్: మండలంలోని కేబీ.దొడ్డి వద్ద ఏర్పాటు చేస్తున్న అక్రమ వెంచర్ పనులను అధికారులు నిలిపివేశారు. ఈసీవాగు పరివాహక ప్రాంతంలో వెంచర్ వేస్తున్న విషయాన్ని ఈ నెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన 'వానొస్తే మునకే..'అనే కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐలు సునీత, సంజీవ, ఎంపీఓ ఉషాకిరణ్, ఇరిగేషన్ ఏఈ మౌనిక ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులను చేపట్టవద్దని యజమానులకు సూచిస్తూ.. తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని అప్పటి దాకా పనులు నిలిపివేయించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. సుల్తాన్‌పల్లి సర్పంచ్ ఇస్తారి, మల్కారం గ్రామస్తులు యాదగిరి రెడ్డి, జంగయ్య, తదితరులున్నారు.

గ్రామస్తుల ఫిర్యాదు..

కేబీ.దొడ్డి సమీపంలో ఈసీవాగు పక్కన వరద కాలువను పూడ్చి వేసి రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు ఇరిగేషన్ ఏఈ మౌనికకు ఫిర్యాదు చేశారు. కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏజీవర్సిటీలో అవగాహన ఒప్పందం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐఆర్‌డీపీఆర్ పూణేలోని వైకుంత మెహతా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ఇరు సంస్థలు శిక్షణ నిర్వహణ, పరిశోధనపై అవగాహన ఒప్పందం జరిగింది. కాగా ఎన్‌ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేందర్‌కుమార్, వైకుంత మెహతా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ హేమయాదవ్‌లు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ భారతదేశానికి సహకార నిర్వహణ సంబంధిత అంశాలపై పరిశోధనలను ఇరు సంస్థలు సంయుక్తంగా చేపట్టనున్నాయని వివరించారు. దేశంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల క్రెడిట్ సపోర్ట్ ద్వారా ఎస్‌హెచ్‌జీలను మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా మార్చే అంశాన్ని చెప్పారు. ఎన్‌ఐఆర్‌డీపీఆర్ రిజిస్ట్రార్ శ్రీకాంత్ రచించిన 'ఇండియాన్ అగ్రికల్చర్ ఇన్‌క్లూజివ్ గ్రోత్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ 11వ రోజులో భాగంగా మంగళవారం 15వ డివిజన్‌లోని శాంతినగర్ రోడ్ నెంబర్ 1,2,3,4, హైదర్షాకోట్ మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత పనులను చేపట్టారు. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శాంతినగర్, హిమగిరి కాలనీలో 10 వీధి కుక్కలను హైదరాబాద్ బ్లూక్రాస్ వారికి అప్పగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్‌లు మల్లేష్, సురేష్, యాదగిరి, సుభాష్, నరేందర్, రామాంజులు, కృష్ణ, వెంకటేష్, గిరి, తౌఫిక్, లక్ష్మీనారాయణ, జగన్, రాము తదితరులున్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

రాజేంద్రనగర్: పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు గుర్రంపల్లి యాదగిరి అన్నారు. అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 123 వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసరావును కలిసి వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా పనిచేయకపోవడంతో ఈ సమస్య నెలకొంటుందన్నారు. త్వరలోనే సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.



ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుప్పాల లక్ష్మణ్ తదితరులున్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: వార్షిక మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా బుధవారం మణికొండ మున్సిపాలటీ కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ ప్రకటించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్, హనుమాన్‌నగర్, ఫ్రెండ్స్ కాలనీ, పంచవటీ, ప్లెజెంట్ వ్యాలీ, శ్రీనివాసనగర్, శివపురికాలనీ, లాలమ్మగార్డెన్, డాలర్‌హిల్స్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.